పిచ్చి మొక్కలు తొలగించరూ..



మండల పరిషత్తు కార్యాలయం వద్ద పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్తు కార్యాలయం పక్క నుంచి మండల వ్యవసాయాధికారి, సెర్ప్ ఐకేపీ కార్యాలయాలకు వెళ్లే దారిలో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి బురదగా మారుతోంది. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు వర్షపు నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కొడిమ్యాల

ముక్కు మూసుకోవాల్సిందే!



గ్రామపంచాయతీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆదేశాలు ఇచ్చే కార్యాలయంలోనే పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే ప్రజలు ముక్కుమూసుకోవాల్సి పరిస్థితి ఉంది. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో అధ్వానంగా మారడంతో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. కార్యాలయం వెనుక వైపు చెత్తతో నిండిపోయింది.

- న్యూస్‌టుడే, సారంగాపూర్

కూర్మావతారంలో పుల్లకంద



జగిత్యాల రైతుబజార్‌లో విక్రయానికి తెచ్చిన పుల్లకంద కూర్మావతారంలో కనిపించడంతో వినియోగదారులు ఆసక్తిగా తిలకించారు. జగిత్యాల మండలం తిప్పన్నపేటకు చెందిన ఓ రైతు తెచ్చిన కందలో కూర్మావతారం వినియోగదారులను ఆకట్టుకుంది.

- న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

స్వచ్ఛత పట్టని యంత్రాంగం

అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. కాలానుగుణ వ్యాధులను నివారించేందుకు పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో నిత్యం అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు తమ కార్యాలయాల్లో మాత్రం స్వచ్ఛతను విస్మరిస్తున్నారు. మండల కార్యాలయాల్లో పారిశుద్ధ్య లోపం, మరుగుదొడ్లు, మురుగునీటితో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

- న్యూస్‌టుడే, కొడిమ్యాల

నీరు నిలుస్తోంది..



మండల పరిషత్తు కార్యాలయ అవరణ పిచ్చిమొక్కలతో నిండి విష పురుగులు సంచరిస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేదు. పై అంతస్తులో వేసిన రేకులు సరిగా లేకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా కార్యాలయం అవరణలో నీరు నిలిచి ఇబ్బందికరంగా మారుతోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మల్లాపూర్

చెత్తతోనే దర్శనం



కోరుట్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెత్త, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి పిచ్చిమొక్కలు, ఎండిన చెట్ల కొమ్మలను తొలగించకుండా వదిలేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. కార్యాలయం తలుపులు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతు చేయకుండా వదిలేశారు. ప్రహరీ వెనకాల వర్షపు నీరు నిల్వ ఉండడంతోపాటు అందులో చెత్తాచెదారం చేరి దుర్గంధం వ్యాపిస్తోంది.

- న్యూస్‌టుడే, కోరుట్ల

నిధులు దుర్వినియోగం

- 6 పీఏసీఎస్‌లు, 2 డీసీఎంఎస్‌లలో జరిగినట్లు గుర్తింపు
- జిల్లాలో ఆరుగురు ప్యాక్స్ కార్యదర్శుల సస్పెన్షన్

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు



గొల్లపల్లి సహకార సంఘం కార్యాలయం

జిల్లాలోని 6 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), 2 డీసీఎంఎస్ కేంద్రాల్లో నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర జిల్లా నుంచి వచ్చిన సహకారశాఖ ప్రత్యేక బృందాలు ఈ నెల 10 నుంచి 22 వరకు 6 ప్యాక్స్‌లు, 2 డీసీఎంఎస్ కేంద్రాల్లో తనిఖీలు జరిపారు. 2014-18, 2018-23 సంవత్సరాల్లో ఆయా సంఘాలు, కేంద్రాల్లో జరిగిన లావాదేవీలను తనిఖీ చేశారు. ఈ మేరకు తనిఖీ అధికారులు 23న కమిషనర్‌కు ఇచ్చిన నివేదిక ప్రకారం ధర్మపురి ప్యాక్స్‌లో రూ.1.62 కోట్లు, పెగడపల్లిలో రూ.1.81 కోట్లు, జైనలో రూ.1.55 కోట్లు, నంచర్లలో రూ.96.12 లక్షలు, తిమ్మాపూర్‌లో రూ.67.18 లక్షలు, గొల్లపల్లిలో రూ.53.58 లక్షలు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ధర్మపురి డీసీఎంఎస్ కేంద్రంలో రూ.6.46 లక్షలు, గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రంలో రూ.13.07 లక్షలు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ప్యాక్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భవనాలు, గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, భూముల కొనుగోలు, పెట్రోలు పంపు నిర్వహణ, ధాన్యం సేకరణలో సామగ్రిని మార్కెటింగ్ శాఖ నుంచి కాకుండా నేరుగా కొనుగోలు చేయటం, వడ్ల కొనుగోలు ఖర్చును అధికంగా చూపటం, ఇతరత్రా నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలోని 6 ప్యాక్స్‌లో రూ.2.85 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించగా మరో మూడు సంఘాల అధికారులు తనిఖీలకు భయపడి ఇటీవల రూ.50 లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు జిల్లాలోని మరికొన్ని సంఘాల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. సహకారశాఖ రాష్ట్ర అధికారుల నిర్ణయం మేరకు జైన, ధర్మపురి, తిమ్మాపూర్, నంచర్ల, పెగడపల్లి, గొల్లపల్లి ప్యాక్స్‌ల కార్యదర్శులు సాగర్‌రావు, రాజేశ్, ప్రభాకర్, మధుకర్, గోపాల్‌రెడ్డి, రాందాస్‌రావులను సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీచేశారు. ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రాల నిర్వాహకులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించారు.

నిబంధనల ప్రకారం చర్యలు

- సీహెచ్.మనోజ్‌కుమార్, జిల్లా సహకారశాఖ అధికారి



రాష్ట్ర స్థాయి అధికారులు ఆయా సంఘాల్లో తనిఖీలు చేపట్టగా కమిషనర్ ఆదేశాలు, సహకారశాఖ నిబంధనల ప్రకారం ఆరుగురు కార్యదర్శులపై చర్యలు చేపట్టారు. ఆయా ప్యాక్స్‌ల పాలకమండలి షోకాజ్ నోటీసులు జారీచేసే వారం రోజుల్లోగా తగిన సమాధానమివ్వకుంటే రద్దుకు చర్యలుంటాయి. ప్యాక్స్‌ల సర్వసభ్య సమావేశం నిర్వహించి చర్చించి తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించాలి. డీసీఎంఎస్ కేంద్రాల్లో ఉద్యోగులతో కాకుండా ప్రైవేటు వ్యక్తులతో పనిచేయించరాదు. రెండు డీసీఎంఎస్ కేంద్రాలపై చర్యలకు నివేదించాము.

ఐలమ్మ స్ఫూర్తిదాయకం



జగిత్యాలలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులు

జగిత్యాల, న్యూస్‌టుడే: రజకార్లను ఎదురించి పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మహిళలు భావితరానికి ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. పురపాలక ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక అదనపు కలెక్టర్ పి.గౌతంరెడ్డి, ఆర్డీవో పి.మధుసూదన్, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు, బీసీ, ఎస్సీ అభివృద్ధి అధికారులు ఎల్.సాయిబాబా, కె.రాజ్‌కుమార్, డీపీవో ఎం.రఘువరన్, తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తిని నింపిందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ భీంరావు, ఏవో శశికళ, డీఎస్పీ రవీంద్రకుమార్, డీసీఆర్బీ, తదితరులున్నారు.

పనిభారం తగ్గించండి



డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: తీవ్రమైన ఒత్తిడితో పనిచేయాల్సి వస్తుందని, వెసులుబాట్లు కల్పించాలని కోరుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు 27న హైదరాబాద్‌కు తరలివెళ్లి సీఎస్, రాష్ట్ర ఉన్నతాధికారులను కలవనున్నారు. జిల్లాలోని 71 క్లస్టర్ల పరిధిలో పనిచేస్తున్న తమకు ధాన్యం సేకరణ కేంద్రాల్లో విధులు కేటాయించటం, కేంద్రప్రభుత్వ డిజిటల్ క్రాప్ సర్వేను ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ప్రైవేటు సంస్థలతో కాకుండా తమతో చేయించటం తగదని ఏఈవోలు పేర్కొంటున్నారు. మహిళా ఏఈవోలకు గ్రామాలకు దూరంగా ఉన్న రైతువేదికల్లో విధుల నిర్వహణ, ప్రతి సర్వేనంబరుకు వెళ్లి క్రాప్‌బుకింగ్ చేయటం కష్టసాధ్యంగా మారిందన్నారు. రైతుభరోసా, పీఎంకిసాన్, రైతుబీమా, క్షేత్ర పరిశీలన, రైతులతో సమావేశాలు, రాయితీల పంపిణీ, రుణమాఫీ, ఆయిల్‌పామ్ సాగు పెంపు, పంటకోత ప్రయోగాలు తదితర చాలా విధులతో తీవ్రమైన పని భారంతో ఉన్నట్లు ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య సురేందర్‌నాయక్, కార్యదర్శి ఎ.వినోద్ పేర్కొన్నారు.

మూడేళ్లుగా అసంపూర్తిగానే!

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: బతుకమ్మ ఘాట్ పనులు మూడేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. మెట్‌పల్లి పట్టణ శివారులోని వట్టివాగు వద్ద బతుకమ్మఘాట్ నిర్మాణానికి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.50 లక్షలు కేటాయించారు. పనులు పూర్తికాకుండానే 2021 అక్టోబరులో హడావుడిగా ప్రారంభించారు. రూ.30 లక్షల బిల్లులు మాత్రమే రావడంతో గుత్తేదారు మిగిలిన పనులు పూర్తిచేయకుండానే వదిలేశారు. ఘాట్‌కు విద్యుత్తు దీపాలు, ఫౌంటెయిన్లు, టైల్స్ వేయాల్సి ఉంది. ఘాట్ మధ్యలో ఏర్పాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విగ్రహాలు కలిపోయేలా ఉన్నాయి. ఈవిషయంపై బల్దియా కమిషనర్ మోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నిధులు విడుదలైన తర్వాతే పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు.



ఇబ్బంది లేకున్నా తొలగించారు!

జగిత్యాల హౌజింగ్ బోర్డుకు వెళ్లే కెనాల్ ప్రధాన రహదారిపై మంగళవారం బల్దియా సిబ్బంది చెట్లను నరికివేశారు. 6 ఏళ్ల కిందట హరితహారం కింద నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. విద్యుత్తు తీగలకు ఎలాంటి ఆటంకాలు లేకున్నప్పటికీ పెరిగిన చెట్లను నరికివేయడం విమర్శలకు తావిస్తోంది.

- న్యూస్‌టుడే, జగిత్యాల



భగీరథ నీరు వృథా

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది. ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండతో పాటు పలు గ్రామాలకు భగీరథ నీటిని సరఫరా చేయడానికి పైపులైన్ నిర్మించారు. ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద పైపులైన్ లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా మురుగు కాల్వలో కలుస్తోంది. అధికారులు స్పందించి లీకేజీ ఏర్పడిన చోట మరమ్మతు చేయించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుట్టలు మాయం



పోతారం గనెగుట్ట నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

సారంగాపూర్, న్యూస్‌టుడే: సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టల మట్టిని తరలిస్తుండడంతో కనుమరుగవుతున్నాయి. సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, అటవీ శాఖకు చెందిన భూములలో ఉన్న చిన్న గుట్టల మట్టిని వివిధ అవసరాలకు తరలిస్తుండడంతో వృక్షాలు నేలమట్టవుతున్నాయి. గుట్టల నుంచి మట్టిని తీసి స్థలాన్ని చదును చేస్తూ వ్యవసాయ భూములుగా మార్చుతున్నారు. గురువారం పోతారంలోని గనెగుట్ట నుంచి కొంత మంది అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెళ్లే సరికి సమాచారం తెలుసుకున్న ట్రాక్టర్లు, జేసీబీ యజమానులు పరారయ్యారు. అధికారులకు తెలిసే మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గుట్టలపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రతికూల వాతావరణంతో జిల్లాలో వరి, పత్తి, పసుపు, కంది తదతర పంటల్లో చీడపీడలు వ్యాపిస్తున్నందున అధికారులు, శాస్త్రవేత్తలతో నిర్ధారించుకొని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారిణి బి.వాణి రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలో రైతుల పంటలను గురువారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.



జగిత్యాల మండలం గుల్లపేటలో వరిపైరును పరిశీలిస్తున్న డీఏవో వాణి

గాలివానకు పడిపోయిన పైర్ల వివరాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఏవో తిరుపతినాయక్, ఏఈవో రమ్య, ఎఫ్‌పీవో అధ్యక్షుడు దమ్మ గంగారెడ్డి, రాజిరెడ్డి, మహేందర్, మల్లారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్ అదృశ్యం


కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్ అదృశ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని ఫుల్‌వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతుండటంతో బుధవారం 'ఈనాడు'లో 'ఫుల్‌వాగులో ఇసుక తవ్వకాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి ఫుల్‌వాగులో ఇసుకను కుప్ప చేస్తున్న బ్లేడ్ ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం చూసేసరికి ట్రాక్టర్ కనిపించకుండా పోవడంతో రెవెన్యూ అధికారులు అవాక్కయ్యారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని లేకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని యజమానిని తహసీల్దార్ కిషన్ హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం పెరిగి.. భూగర్భ జలం తరిగి..

- ఇంకుడుగుంతల నిర్మాణాలపై పట్టింపు కరవు
- ఈసారైనా పురపాలికశాఖ ఉత్తర్వులు అమలయ్యేనా?

"ఈ ఏడాది వేసవిలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నీటికి కటకట ఏర్పడింది. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు ముందస్తుగా మేల్కొనే విధంగా చర్యలు తీసుకోవాలి."

- ఆరు నెలల కిందట రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు



న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్

నగరాలు, పట్టణాల్లో రోజురోజుకు జనాభా ఎక్కువవుతుండగా శివారు ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. ఖాళీ స్థలాలన్నీ మాయమవుతుండటంతో వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. పైగా నీటి సంరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రతి ఇంటిలో బోరు తవ్వుకోవడం, నీటిని వినియోగించుకోవడం ఎక్కువ అవుతోంది. వృథా నీరంతా కాలువల గుండా వెళ్లి పోతుండటంతో భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి.

ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాలన్న ఆదేశాలున్నా ఎవరూ పాటించడం లేదు. తాజాగా పురపాలక శాఖ 300 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని ఆదేశించింది. ఈసారైనా ఆదేశాలు అమలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడంతో ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సైతం ఆలస్యంగా కురియడంతో కాస్త నీటి నిల్వలు పెరిగినప్పటికి.. భూగర్భ జలాలు పెంచుకోవాలనే ఆవశ్యకతను గుర్తించడం లేదు. కరీంనగర్, రామగుండం నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో కచ్చితంగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని పేర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు సైతం ఆ వైపే దృష్టిసారించడం లేదు.

అనుమతులకే పరిమితం

ఇంటి నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకునే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో కొంత మొత్తాన్ని ఇంటి యజమానులు ఫీజు చెల్లిస్తున్నారు. చదరపు మీటర్ చొప్పున సుమారు రూ.2 వేల వరకు డిపాజిట్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడుగుంత నిర్మిస్తే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అనుమతులు ఇచ్చిన అధికారులు దానిని నిర్మించారా? లేదా? అనేది మాత్రం పరిశీలించడం లేదు. పైగా రూ.లక్షల్లో జమ అయిన ఆ మొత్తాన్ని ఇతర అవసరాలకు ఇన్నాళ్లు వినియోగిస్తున్నారు.



కరీంనగర్‌లోని నగరపాలిక పార్కులో నిర్మించిన ఇంకుడుగుంత

300ల చదరపు మీటర్లకు తప్పనిసరి

- మున్సిపాలిటీలు, నగరాల్లో 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.
- ఇప్పటికే ఉన్న భవనాల్లో ఏడాదిలో నిర్మించుకోవాలి.
- ఆక్యుపెన్సీ కం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇంకుడుగుంత నిర్మించారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.
- వీటిని నిర్మించుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత కూడా మున్సిపల్ కమిషనర్లదేనని ఉత్తర్వులో వివరించారు.

- కరీంనగర్ నగర పరిధిలో 300 చదరపు మీటర్లు ఉన్న భవనాలు 791 ఉన్నట్లుగా ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించారు.
- ఇప్పటికే 458 బహుళ అంతస్తులో నిర్మించుకున్నారు.
- మిగతా 333 భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు. అందులో 24 భవనాల్లో కొత్తగా నిర్మించుకున్నారు.
- స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునాతన సాంకేతికను జోడించి ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు



ఎంపికైన జట్లు

జగిత్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీస్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 14, 17 ఏళ్లలోపు బాల, బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఇందులో 150 మంది వరకు క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని జిల్లా విద్యాధికారి బి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పీడీలు అజయ్, క్రిష్ణప్రసాద్, కోటేశ్వర్, సాగర్, వేణు, భాస్కర్, దయాకర్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల బదిలీ

జగిత్యాల: జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు నాయబ్ తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. ఈ మేరకు కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సారంగాపూర్ తహసీల్దారు కె.వరందన్‌ను గొల్లపల్లికి బదిలీ చేశారు. అక్కడి తహసీల్దారు యండీ.జమీర్‌ను సారంగాపూర్‌లో నియమించారు. జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దారు యం.కిరణ్‌కుమార్‌ను కొడిమ్యాలకు, కలెక్టరేట్‌లో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దారు యండీ ఫారుఖ్‌ను కోరుట్ల నాయబ్ తహసీల్దారుగా బదిలీ చేశారు.



ఎలగందుల ఖిల్లా

రాజులు ఏలిన ప్రాంతాలు.. ప్రకృతి సోయగాలు



వేములవాడ రాజన్న ఆలయం

- ఉమ్మడి జిల్లాలో పలు చారిత్రక క్షేత్రాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

జలపాతాలు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు.. ఉమ్మడి జిల్లా పర్యాటకుల మనసులను పులకరింపజేస్తాయి. యాత్రికులను ఆకట్టుకునే పుణ్యక్షేత్రాలు.. రాజులు పాలించిన ప్రాంతాలను ఇప్పటికీ వేలమంది సందర్శిస్తున్నారంటే వీటి ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు.. వసతులు కల్పిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పర్యాటక క్షేత్రాల విశేషాలు, వాటి అభివృద్ధి అనుకూలతలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రదేశం:
- ● నిర్మించినది
- ■ ప్రత్యేకత
- ✷ కల్పించాల్సిన సౌకర్యాలు

కోటలు.. చరిత్రకు ఆనవాళ్లు

ఎలగందుల ఖిల్లా, కరీంనగర్ జిల్లా

● శాతవాహనులు. కోటి లింగాలను రాజధానిగా ప్రాంతీయ ఏడు రాజులు గోభద, నారన, కంవయస, సమగోప పాలనలో నిర్మితమైనట్లు లభ్యమైన నాణేలను బట్టి తెలుస్తుంది.

■ ఈ కోట శాతవాహనులతోపాటు బాదామి చాళుక్యుల (550-750) నుంచి ఆసఫ్‌జాహీల(1724-1948) కాలం వరకు పాలన కేంద్రంగా విరాజిల్లింది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది.

✷ ఎలగందుల ఖిల్లా చారిత్రక ప్రాంతం కావడంతో ప్రభుత్వం 2014లో పర్యాటక కేంద్రంగా ప్రకటించి.. సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకే నిలిచిపోయింది. సామగ్రి దెబ్బతింది. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే గార్డెన్స్, పార్కులు, రెస్టారెంట్లు, రవాణా సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉంది. కోట గురించి ఈతరం వారికి తెలియజేసేలా తీర్చిదిద్దాలి.



మొలంగూరు ఖిల్లా, కేశవపట్నం మండలం, కరీంనగర్ జిల్లా

● ప్రతాపరుద్రుని అధికారులలో ఒకరైన వారగిరి మొగ్గరాజు దీనిని నిర్మించాడు.

■ దూద్ బావి బహుళ ప్రాచుర్యం

✷ గుట్టపైన, కింద కోనేరులు.. దూద్ బావి, శివాలయం, వీరభద్రాలయం, కోట బురుజులు, రాతి ద్వారాలు, కందకాలు, ఫిరంగులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి దూద్ బావిలోని నీరు ఏ కాలంలో అయినా పాల వలె తెల్లగా ఉంటాయి. ఈ నీరు ఆరోగ్యానికి మంచిదని అక్కడి గ్రామస్థులు తీసుకెళతారు.. ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



రామగిరి ఖిల్లా, కమాన్‌పూర్ మండలం బేగంపేట, పెద్దపల్లి జిల్లా

● శాతవాహనులు నిర్మించారని చారిత్రక అధారాలు చెబుతున్నాయి. వారు దీనిని రక్షణ కోటగా వినియోగించుకొని కోటి లింగాలను రాజధానిగా చేసుకొని పాలించారు.

■ శత్రుదుర్భేద్యమైన ఈ కోట అరుదైన శిల్పకళ, బురుజులకు నిలయం. కోట పరిసర ప్రాంతాల్లో వనమూలికల సంపత్తి, అరుదైన వృక్షాలున్నాయి.

✷ ఇక్కడ వనమూలికలు, అరుదైన వృక్షాలను చూసేందుకు వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు, ఆయుర్వేద నిపుణులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వస్తారు. ఈ కోటకు అన్ని రకాలు వసతులు, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోనే సుందరమైన ప్రదేశంగా విరాజిల్లుతుంది. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు బొటానికల్ పర్యటన క్షేత్రంగా మారనుంది.

కరీంనగర్ మానేరు జలాశయం

సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు కరీంనగర్‌లో మానేరు డ్యాం నిర్మాణం చేశారు. ఈ డ్యాంను ఆనుకొని ప్రభుత్వం ఉజ్వల, జింకల పార్కులు, హరిత హోటల్ నిర్మించారు.

✷ మానేరు డ్యాంపై నీడ వసతి, ఫుడ్ కోర్టులు పెరగాల్సిన అవసరముంది. కొదురుపాక మధ్య మానేరులోనూ వసతులు, సౌకర్యాలు పెంచితే బోటింగ్‌కు సందర్శకుల సంఖ్య పెరగనుంది. ఉజ్వల, జింకల పార్కులను మరింత ఆకర్షించేలా తీర్చిదిద్దాలి.

✦ హరిత హోటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇస్కాన్ టెంపుల్, తితిదే వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణంతోపాటు మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన ప్రాంతాలను తీర్చిదిద్దితే జిల్లాలో పర్యాటకులు పెరగనున్నారు. కోటి రూపాయాలతో తయారైన క్రూజ్ పడవను త్వరలో నడిపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవాలయం

● పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాదిత్యుడు రాజరాజేశ్వర దేవాలయం నిర్మించాడని శిలాశాసనం ద్వారా తెలుస్తుంది.

■ దక్షిణ కాశీగా విరాజిల్లుతుంది. వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడి దర్శనానికి వస్తుంటారు.

✷ ప్రసాద్ లాంటి కేంద్ర పథకాలు వేములవాడతో పాటు కొండగట్టు, ధర్మపురి, ఇల్లందకుంట దేవాలయాలకు వర్తింపజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం మరిన్ని నిధులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలి. రవాణా పరంగా రైల్వేలైన్ వేయాల్సి ఉంది.



గోదావరిఖని గనులు

సహజ నిక్షేపాలుగా బొగ్గు గనులు బయటపడ్డాయి.

■ భూగర్భ గనుల తవ్వకాలు, ఓపెన్ కాస్ట్ మైనింగ్ పనులతోపాటు పవర్ ప్లాంట్‌లు ఉన్నాయి.

✷ గతంలో ఆర్టీసీ, మైనింగ్ సంస్థలు కలిసి పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పించారు. బస్సు సర్వీసు ద్వారా తీసుకొచ్చి ఖనిలో జరుగుతున్న బొగ్గు గనుల తవ్వకాలు, ఈ ప్రాంత విశేషాలు చూపించేవారు. అనంతరం నిలిపివేశారు. పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

అసలే ఆలస్యం.. ఆపై ఆవేదన

- ఉమ్మడి జిల్లాలో 228 మందికి 61 పేర్లతోనే జాబితా
- 2008 డీఎస్సీ బాధితులకు ఒప్పంద ఉద్యోగాల తీరు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యా విభాగం

సర్కారు కొలువే లక్ష్యంగా చదివిన వారి ఆశలపై చివరి నిమిషంలో ప్రభుత్వ నిర్ణయం నీళ్లు చల్లింది.. న్యాయం కోసం పోరాడిన వారికి అనుకూలంగా కోర్టులు తీర్పునిచ్చాయి.. ఇది పదహారేళ్ల కిందటి మాట.. బాధితులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా అర్హుల జాబితా తప్పుల తడకగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది..

2008 డీఎస్సీలో అర్హత సాధించినా ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమైన అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఉంచిన ఉమ్మడి జిల్లా జాబితాలో చాలా తక్కువ మంది పేర్లుండగా, అందులో అసలైన బాధితుల వివరాలు లేవు.

బాధితులు 228 మంది

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 2008 డీఎస్సీలో 970 ఎస్జీటీ పోస్టుల భర్తీ చేపట్టగా రెండేళ్ల అనంతరం ఫలితాలు వెల్లడించారు. 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో దాదాపు 228 మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ఆనందాన్నిచ్చినా వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితాలో కేవలం 61 మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. వాళ్లు కూడా అప్పట్లో రెండు ఉద్యోగాలకు పరీక్ష రాసి, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారే. 16 ఏళ్ల తర్వాత కొలువు దక్కబోతుందన్న బాధితుల సంతోషం జాబితా చూడగానే నీరుగారిపోయింది. రెండు రోజుల కిందట ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి బాధితులు డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జాబితా రూపకల్పనలో జిల్లా అధికారుల తప్పిదం రాష్ట్ర విద్యాశాఖకు తెలియడంతో గురువారం వెబ్‌సైట్ నుంచి దాన్ని తొలగించారు.



జాబితాలో పేర్లు లేవని డీఈవో కార్యాలయానికి వచ్చిన 2008 డీఎస్సీ బాధితులు

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఉమ్మడి రాష్ట్రంలో 2008లో డీఎస్సీ నిర్వహించిన సందర్భంగా చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను ప్రత్యేకంగా డీఈడీ చేసిన వారికి ప్రభుత్వం కేటాయించింది. ఈ నిర్ణయంతో మార్కుల పరంగా ముందున్న ఎంతో మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ పోరాటం చేస్తూనే ఉన్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు వీరికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ అధికారంలోకి రావడంతో ఒప్పంద విధానంలో నియామకానికి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి అక్టోబరు 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన, తదుపరి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ పత్రాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు ప్రకటించింది. బాధితులు పూర్తి వివరాలు నింపి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం తీసుకునేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేయాలని సూచించింది.

ఇప్పటికైనా న్యాయం చేయాలి

-టి.స్నేహ, అభ్యర్థిని



2008 డీఎస్సీలో అర్హత సాధించినా అధికారుల నిర్ణయంతో ఉద్యోగాలు కోల్పోయాం. విద్యాశాఖ రూపొందించిన జాబితాలో మా పేర్లే లేవు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలి.

జాబితాను సరిచేయండి

-ఎస్.జలపతిరెడ్డి, అభ్యర్థి



చాలా ఏళ్ల తర్వాత ఒప్పంద ఉద్యోగమైనా దక్కుతుందని సంతోషించా. డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థుల పేర్లు జాబితాలో లేవు. అసలే ఆలస్యం, ఆపై ఇలా చేయడం సరికాదు. జాబితాను సరిచేయాలి.

వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

-జనార్దన్‌రావు, కరీంనగర్ డీఈవో

వెరిఫికేషన్ కోసం వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితా గతంలో పంపించింది. అందులో తప్పిదాలుంటే పరిశీలన బృందంతో తనిఖీ చేయిస్తాం. నష్టపోయిన వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. వెబ్‌సైట్ నుంచి జాబితా తొలగించిన విషయం నాకు తెలియదు.

శుక్రవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ముగిసిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండో స్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా దక్కించుకుంది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

29న కొండగట్టులో బ్రాహ్మణ సంఘం చర్చాగోష్ఠి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ వర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక అంశాలపై చర్చించేందుకు ఈ నెల 29న కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్‌లో చర్చాగోష్ఠి నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.ఉజ్వల, రిసార్ట్ అధినేత మర్రిపల్లి కొండల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపకుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని పలువురు ముఖ్య అర్చకులు, అతిథులు హాజరవుతారన్నారు. వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఔత్సాహికులు 73821 71021, 90595 50280 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

28న గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

కరీంనగర్ కొత్తపల్లి: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా పోరాట కార్యక్రమంలో భాగంగా 28న హైదరాబాద్ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి తెలిపారు. గురువారం కొత్తపల్లి మండలం చింతకుంట తదితర గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో మారిన పని వేళలతో స్టడీ అవర్స్ తర్వాత రాత్రి 9.00 గంటలకు ఇళ్లు చేరడానికి మహిళా ఉపాధ్యాయులు అవస్థలు పడతున్నారన్నారు.

శ్రీరామసాగర్‌కు 1.09 లక్షల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మరోసారి భారీగా వరద వచ్చిచేరుతోంది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 22 స్పిల్‌వే గేట్లద్వారా 81,224 క్యూసెక్కులను, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 19 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది. అధికంగా నీటిని విడుదల చేస్తున్నందున గోదావరి నది, వరదకాలువ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ట్రేడింగ్ యాప్‌లో రూ.4.45 లక్షలు స్వాహా

ధర్మపురి, న్యూస్‌టుడే: ట్రేడింగ్ యాప్‌లో రూ.4.45 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం గురువారం ధర్మపురిలో వెలుగు చూసింది. స్థానిక ఎస్సై మహేష్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఓ యువకుడు కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆకర్శితుడయ్యాడు. ఈ క్రమంలో ట్రేడింగ్ ఇన్వెస్టుమెంటు యాప్‌లో తన వివరాలను నమోదు చేసుకున్నాడు. మొదట కొంత నగదు తన బ్యాంకు ఖాతాలోకి జమ కావడంతో.. మరో ట్రేడింగ్ యాప్‌లో తనకు సంబంధించిన పాన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను నమోదు చేసి.. అన్నింటికీ అనుమతిలిచ్చాడు. దీంతో వెంటవెంటనే తన ఖాతాలో నుంచి రూ.4.45 లక్షలు డెబిట్ అయినట్లు సందేశాలు రావడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సాయి కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై, చెడు వ్యసనాలకు అలవాటు పడి తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కిందట అతని భార్య, బాబుతో పాటు అమ్మగారికి వెళ్లిపోయింది. ఆర్థిక ఇబ్బందులు, భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఇంటి ముందు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు కొనివ్వలేదని మనస్తాపంతో..

జగిత్యాల గ్రామీణం: కారు కొనివ్వలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగిత్యాల గ్రామీణ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన బేతపు వంశీ(20) కారు కొనివ్వాలని తండ్రి రాజలింగయ్యను కొన్ని రోజులుగా అడుగుతున్నాడు. తండ్రి కొనివ్వకపోవటంతో లక్ష్మీపూర్ గుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని అయిదు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధునికత వైపు అతివల పయనం

నైపుణ్యాలతో మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో రాణింపు

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల

వస్త్రోత్పత్తులంటేనే అద్భుతమైన కళానైపుణ్యం ఉండాలి. తమ అభిరుచికి తోడు ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచనలు చేస్తేనే ఈ రంగంలో రాణింపు సాధ్యం. ఒకప్పుడు చేనేత మగ్గాలపైన కనిపించే మహిళలు నేడు మరమగ్గాల వైపు అడుగులు వేస్తున్నారు. వస్త్రోత్పత్తుల్లో వస్తున్న ఆధునికతను సైతం అందిపుచ్చుకుంటున్నారు. కుటుంబ పోషణకు ఉపాధిగా మార్చుకున్నారు. ఆ ఆత్మవిశ్వాసం వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. మగవారికి దీటుగా మరమగ్గాలను నడిపిస్తున్నారు. ఓవైపు ఇంటి బాధ్యతలు చూస్తూనే కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తూ పలువురికి స్ఫూర్తినిస్తున్నారు సిరిసిల్లకు చెందిన మహిళలు.

సిరిసిల్లలో దశాబ్దాల క్రితమే మరమగ్గాల వస్త్రపరిశ్రమ వేళ్లూనుకుంది. పురాతనమైన మగ్గాలపై ఒకే రకమైన ఉత్పత్తులకు పరిమితమవడం వల్ల ఇక్కడి పరిశ్రమ తరచూ సంక్షోభంలోకి వెళ్తుంది. తరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న నేతన్నలు ఇప్పుడిప్పుడే బహిరంగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు.

పిల్లల ఉన్నత చదువులకు...



పిల్లలు ఉన్నత చదువులు చదువుతామని పట్టుబట్టారు. కొడుకు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, కూతురు ఇంటర్ రెండో సంవత్సరం. వారి చదువుకు అప్పులు చేయడం కంటే చిన్నప్పటి నుంచి తెలిసిన పని కావడంతో మరమగ్గాలు నడిపించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త కొత్త డిజైన్లు తయారు చేస్తుంటారు. వాటికి తగ్గట్టుగా చీరలు, పంచెలు వంటివి నేస్తున్నాను. నాతోపాటు మరో ఇద్దరికి పని కల్పిస్తున్నాను. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. **- సామల వాణి, అంబికానగర్**

- వివిధ రకాల వస్త్రోత్పత్తులను ఉత్పత్తి చేస్తూ మార్కెట్‌లోనూ తమకంటూ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నేతన్నలకు ఆయా కుటుంబాల్లోని మహిళలు చేదోడుగా నిలుస్తున్నారు.
- కాలక్షేపానికి నేర్చుకున్న కళ ఇప్పుడు వారికి అదే వృత్తిగా మారింది.
- సాధారణ మరమగ్గాలపైనే కాకుండా డాబీ, జకార్డులు అమర్చిన వాటిపైన వస్త్రోత్పత్తుల్లోనూ తమ నైపుణ్యంతో రాణిస్తున్నారు.
- పట్టణంలో శాంతినగర్, రాజీవ్‌నగర్, అంబికానగర్, బీవైనగర్‌ల్లోని చాలా ఇళ్లలోని కార్ఖానాల్లో మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు నేస్తున్న మహిళలు కనిపిస్తున్నారు. వీరు బీములు పోయడం మినహా మిగతా అన్ని పనులు చేస్తున్నారు. వస్త్రాలకు డిజైన్లు వేయడం, కండెలు చుట్టడం, టాకాలు వేయడం వంటి పనులు చేస్తున్నారు.



ఎలక్ట్రానిక్ జకార్డు అమర్చిన మరమగ్గంపై వస్త్రోత్పత్తులు

ఆర్థికంగా నిలదొక్కుకోవాలని...



బీడీలు చుడుతూ ఖాళీ సమయంలో భర్తతో కలిసి అప్పుడప్పుడు మరమగ్గాలు నడపడం నేర్చుకున్నా. బీడీల పని నెలలో పదిహేను రోజులు కూడా రావడం లేదు. పిల్లలు పెద్దవాళ్లు అవుతుండటంతో ఖర్చులు పెరుగుతూ వస్తున్నాయి. అప్పులు చేసి అగాధంలో పడే కంటే భార్యాభర్తలం ఇద్దరం ఇంట్లోనే వచ్చిన పని చేస్తున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆర్డర్లతోపాటు వివిధ రకాల ప్రైవేటు ఆర్డర్లు దోమ తెరలు, గ్రే కలర్ పాలిస్టర్ కూడా తీసుకుంటున్నాం. **- బిల్ల అత, రాజీవ్‌నగర్**

గుర్తింపు లభించింది



మరమగ్గాలు నడపడం, వస్త్రోత్పత్తులపై నా భర్త తర్ఫీదు ఇచ్చారు. ఉదయం ఇంటి పనులు పూర్తయ్యాక కార్ఖానాలో మరమగ్గాలు నడుపుతాను. రాత్రి సమయంలో ఆయన చూసుకుంటారు. బతుకమ్మ చీరల సమయంలో పెట్టుబడులకు ఇబ్బంది కాకుండా, కార్మికుల కొరతను అధిగమించేందుకు మేమే నడుపుకున్నాం. 2023లో చేనేత, జౌళిశాఖ ఉత్తమ మహిళా కార్మికురాలిగా గుర్తించింది. నాలా చాలా కుటుంబాల్లోని గృహిణులు మరమగ్గాలు నడుపుతూ చేదోడువాదోడుగా ఉంటున్నారు. **- వనం సంధ్య, రాజీవ్‌నగర్**

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

- న్యూస్‌టుడే, మల్యాల

? మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షల రిపోర్టు ఇవ్వడం లేదు. - బాబు శ్రీనివాస్, మల్యాల

✓ పేపర్లు అందుబాటులో లేకపోతే రక్త పరీక్షలు చేయించుకున్నవారి చరవాణికి పంపే రిపోర్టును ప్రింట్ తీసుకోవచ్చు. -డాక్టర్ ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉపవైద్యాధికారి

- న్యూస్‌టుడే, కోరుట్ల

? కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి దుర్గంధం వ్యాపిస్తోంది. -సుమన్, కోరుట్ల

✓ వెంటనే పరిశీలించి కల్లూర్‌రోడ్‌లోని మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. -అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్


మల్లాపూర్‌లో మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక సంఘం ప్రతినిధులు

చలో కలెక్టరేట్‌కు తరలిరావాలి

మల్లాపూర్, న్యూస్‌టుడే: జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబర్-4న తలపెట్టిన చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మల్లాపూర్ భరతమాత కూడలిలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చెరకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, రైతు ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల రమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నోముల నరసింహారెడ్డి, ఎలిసే పోషన్న, గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, లింబారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల 132 కేవీ ఉప కేంద్రంలో పరిధిలోని చల్‌గల్, సారంగాపూర్, పొలాస, మన్నేగూడెం సెక్షన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. జగిత్యాల పట్టణంలోని టౌన్-1 పరిధిలోనూ, టౌన్-2, పరిధిలోనూ సరఫరా నిలిపివేయనుంది.

సారంగాపూర్: జగిత్యాల ఉపకేంద్రం పరిధిలోని సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ తెలిపారు. మరమ్మతు దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు బట్టపల్లి, కోనాపూర్, పోచంపేట, నాగునూర్, లచ్చక్కపేట, అర్పపల్లి, లక్ష్మీదేవిపల్లి, ధర్మనాయక్‌తండా, రేచపల్లి, వడ్డెరకాలనీ, రంగాపేట, లచ్చునాయక్, మ్యాడారం తండాలు, బీరెడ్డిగూడెం, పోతారం, సారంగాపూర్‌లో విద్యుత్తు ఉండదని వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

స్వచ్ఛతాహీ సేవా

జగిత్యాల వాణిజ్యం: టీటీఎల్‌బ్యాంకు, కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో జగిత్యాలలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ద్వారా పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఎల్‌డీఎం రామ్‌కుమార్, కేడీసీసీబీ మేనేజర్ మొహిజ్‌పాషా, క్షేత్రాధికారి రాకేశ్, జగిత్యాల, సారంగాపూర్, కల్లెడ ప్యాక్స్ కార్యదర్శులు గాజెంగి వేణు, శివకుమార్, జాజాల శేఖర్, బోయిని రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జగిత్యాలలో ఎల్‌డీఎం, అధికారులు

విద్యార్థులకు పోటీల నిర్వహణ

ధర్మపురి: పట్టణంలో గురువారం పురపాలక అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మానవతా కేంద్రంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పురపాలక అధ్యక్షురాలు సత్తెమ్మ, ఉపాధ్యక్షుడు, కమిషనర్ ఇన్‌స్పెక్టర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం కుస్తాపూర్ బైపాస్ రహదారిలో గురువారం ఉదయం సిమెంట్ లారీ బోల్తాపడింది. కుస్తాపూర్ శివారులోని బైపాస్ రహదారిపై రైతులు మొక్కజొన్న కంకులను ఆరబోశారు. సిమెంట్ లోడ్‌తో మల్లాపూర్‌కు వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసు అధికారులు స్పందించి రహదారులపై మొక్కజొన్న కంకులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


కుస్తాపూర్ శివారులో బోల్తాపడ్డ లారీ

చాకలి ఐలమ్మకు నివాళి


గొల్లపల్లిలో విప్ లక్ష్మణ్‌కుమార్ తదితరులు


మెట్‌పల్లి పట్టణం: ఐలమ్మ విగ్రహానికి నివాళులు


జగిత్యాల గ్రామీణం: మోరపల్లిలో..


గొల్లపల్లిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


కోరుట్లలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు


రాయికల్‌లో..


మల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు


సారంగాపూర్‌లో..


మేడిపల్లి: వెంకట్రావుపేటలో..


కొడిమ్యాలలో..

చాకలి ఐలమ్మ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- న్యూస్‌టుడే యంత్రాంగం


ధర్మపురిలో..


మల్యాలలో..


రాయికల్ : అల్లీపూర్‌లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత


మెట్‌పల్లిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నర్సింగరావు


పొలాస పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు

పోషకాహారంపై అవగాహన

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు విమల, రాజమణి, సుమతి, కాలేశ్వరి, మంజుల, తెలజ, సుజాత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా చిన్నారుల బరువు తప్పకుండా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో గురువారం పోషణమాసం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరాలు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

రాయికల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జగిత్యాల సీడీపీవో మమత అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గురువారం పోషకాహార వారోత్సవాల సందర్భంగా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నప్రాసన, సామూహిక సీమంతాలు చేశారు. ఎంపీడీవో బింగి చిరంజీవి, ఏపీయం శ్రీనివాస్‌చక్రవర్తి, సూపర్‌వైజర్లు పద్మావతి, ఉమా, తదితరులున్నారు.


అయిలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

భారాస హయాంలోనే అభివృద్ధి

కోరుట్ల, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, పార్టీని వీడిన నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం కోరుట్ల భారాస కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, రూ.20 కోట్ల నిధులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భారాసను వీడిన నాయకులు తిరిగి సొంత గూటికి రావాలని కోరారు. 30వ వార్డు కౌన్సిలర్ ముజాఫర్ అహ్మద్(సజ్జు) కాంగ్రెస్ పార్టీనీ వీడి భారాసలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. దారిశెట్టి రాజేశ్, ఫహీం, బట్టు సునీల్, సత్యం, బాబా, భాస్కర్‌రెడ్డి, అతిక్, అన్వర్, సనావోద్దీన్, రహీంపాషా, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలర్ ముజాఫర్ అహ్మద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న విద్యాసాగర్‌రావు

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

బుగ్గారం, వెల్గటూరు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నోడల్ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. బుగ్గారం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పలు మండలాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులకు సముదాయ సమావేశాన్ని నిర్వహించారు. మరోవైపు వెల్గటూరు, ఎండపల్లిలలో జరిగిన పాఠశాల సముదాయ సమావేశంలో సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరల్ అధికారి రాజేశ్ పాల్గొన్నారు. జాతీయ సాధనా సర్వే పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.


కోరుట్లలో నివాళులర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల సి.ప్రభాకర్ భవన్‌లో సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. కృష్ణారావు, విశ్వనాథం, పేట భాస్కర్, సుతారి రాములు ముగ్రం, మౌలానా, శాంత, రాధ, వంశీకృష్ణ, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ త్యాగాలు మరువలేనివి

పెగడపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు మరువలేనివని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సుద్దపల్లిలో ఏర్పాటుచేసిన ఆయన విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ఆ మహనీయుని జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వాటర్‌ప్లాంట్ వద్ద బోర్‌వెల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకు మహిళ అప్పగింత

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణంలోని ఆదర్శనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళను గురువారం పోలీసులకు అప్పగించారు. ఆదర్శనగర్‌లో ఓ ఇంటికి ఒకవైపు దుకాణం ఉండగా, వెనుక ద్వారం నుంచి మహిళ ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో ఇంటి యజమాని దుకాణంలో నుంచి ఇంటి లోపలికి వెళ్లగా, మహిళ కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు.

యువ టూరిజం క్లబ్‌తో పర్యాటక స్ఫూర్తి

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: యువ టూరిజం క్లబ్ ద్వారా విద్యార్థినుల్లో పర్యాటక స్ఫూర్తి కలుగుతుందని ప్రిన్సిపల్ కె.రామకృష్ణ పేర్కొన్నారు. 60 మంది విద్యార్థినుల బృందం పర్యాటక యాత్రను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ విద్యార్థినులు పర్యాటక ప్రాంతాలైన జగిత్యాల ఖిలా, పొలాస చారిత్రాత్మక శిలాశాసనం, ధర్మపురి లక్ష్మీనృసింహ క్షేత్రాన్ని పర్యటించనున్నట్లు చెప్పారు.



జగిత్యాల ఖిలా సందర్శనలో విద్యార్థినులు

ఘనంగా యువజన దినోత్సవం

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీస్టేడియం భవనంలో డీవైఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ్యుడు ఎం. సంజయ్‌కుమార్, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక అంశాలను పరిశీలించి అభినందించారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, డీవైఎస్‌వో రవికుమార్, నవీన్, గంగమల్లు, శ్రీకాంత్, ధర్మరాజు, అనిల్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు తదితరులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మందికి మంజూరైన రూ.45,05,220 విలువ చేసే కల్యాణలక్ష్మి, 26 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం పంపిణీ చేశారు. అనంతరం తిర్మలాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సింగిల్‌విండో ఛైర్మన్లు మేనేని రాజనర్సింగరావు, బండ రవీందర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, నారాయణ, మల్లికార్జున్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం

కొడిమ్యాల: కొడిమ్యాల మండలం అప్పారావుపేట గ్రామశివారులోని అక్రమ లే-అవుట్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం పట్ల పంచాయతీ కార్యదర్శిపై జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా మండలాధ్యక్షులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, పలువురు గ్రామస్థులు అక్రమ లే-అవుట్‌పై అధికారులకు ఫిర్యాదు చేయగా అదనపు కలెక్టర్ గురువారం విచారణ చేపట్టారు. తప్పు జరిగినట్లు పంచాయతీ కార్యదర్శి ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని, తగిన చర్యలు తీసుకుంటారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. డీపీవో రఘువరణ్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవి, గ్రామస్థులు పాల్గొన్నారు.


కార్యదర్శిని విచారిస్తున్న అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి

అక్రమ కేసులు ఎత్తివేయాలి

జగిత్యాల: గత ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేశారని ఆర్టీసీ కార్మికులు అన్నారు. కేసులను ఎత్తివేయాలని కోరుతూ గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిశారు. స్పందించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖ రాశారు.


జీవన్‌రెడ్డితో ఆర్టీసీ కార్మికులు

సంక్షిప్తం

మౌలిక వసతుల కల్పనకు కృషి

సారంగాపూర్: పరిపాలన సౌలభ్యం కోసం తండాలను పంచాయతీలుగా మార్చడంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పోతారం శివారులోని గణేష్‌పల్లె గ్రామస్థులు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆయనను కలిశారు. మండలంలోని రంగపేటతోపాటు పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు.

అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలి

మల్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని, వివిధ రకాల కృత్యాలతో వారికి సులభమైన పద్ధతుల్లో ప్రాథమిక అంశాలను నేర్పించాలని మల్యాల మండల విద్యాధికారి జయసింహారావు ఉపాధ్యాయులకు సూచించారు. రామన్నపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో 'బేసిక్స్' నేర్పే విధానంపై నిర్వహించిన మూడు మండలాల ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు.

హద్దులు కేటాయించాలని వినతి

రాయికల్: మంగ్యానాయక్ తండా శివారులోని సర్వే నంబరు 58లో గల ప్రభుత్వ భూమికి హద్దులు కేటాయించాలని గురువారం గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మాలవత్ తిరుపతి, మాలవత్ నరేందర్, పాల్త్య ప్రభాకర్, జగన్, హరిదాస్, మోహన్, రవీందర్, భాస్కర్, తదితరులున్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ శిబిరం

జగిత్యాల పట్టణం: స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ శిబిరం గురువారం నిర్వహించారు. తృతీయ సంవత్సరం విద్యార్థులను తమ శిక్షణా కార్యక్రమాలతో ఉద్యోగాలు సాధించేవిధంగా తీర్చిదిద్దనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపల్ కొక్కుల రాజేందర్, వెంకటరమేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పార్వతుల కల్యాణం

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణంలోని శ్రీషిర్డి సాయి మందిరంలో వారం రోజులుగా తిగుళ్ల విశ్వశర్మచే నిర్వహిస్తున్న దేవీ వైభవ పురాణ సప్తాహ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జ్యోతిష్య, వేద పండితులు నంబి వేణుగోపాలాచార్య కౌశిక, తిగుళ్ల విశ్వశర్మ పర్యవేక్షణలో భక్తి శ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

వరిలో తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల: వరిలో తెగులు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సాధ్వి అన్నారు. కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లె గ్రామంలోని వరి పంటను గురువారం పరిశీలించారు. విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సహ పరిరక్షణ కన్వీనర్‌గా సుజాఅలీ

జగిత్యాల: సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జిల్లా కన్వీనర్‌గా మహ్మద్ సుజాఅలీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి నియామకపత్రం అందించారు. సమితి అభివృద్ధికి కృషి చేస్తానని ఈసందర్భంగా సుజాఅలీ పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మల్లాపూర్: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన మాట్ల అజయ్ కుటుంబానికి బాల్య మిత్రులు రూ.22 వేల నగదుతో పాటు నిత్యావసర సరకులు అందజేశారు. రాజేందర్, నిమిషకవి రాజేష్, ముష్కరి వినోద్, గండికోట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కోరుట్ల: నిరుపేదలకు సేవలందించేందుకు లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని 320జీ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం కోరుట్ల సినారే భవన్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 40 మంది నిరుపేదలకు రూ.1.20 లక్షల విలువ గల నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మోర బద్రేశం, శ్రీనివాస్ రావు, పోతని ప్రవీణ్, ఆడెపు కమల, అల్లాడి ప్రవీణ్, ఆడెపు మధు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీ, జరిమానా

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని కిరాణ దుకాణాలు, ప్లాస్టిక్ ఏజెన్సీలలో గురువారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.6వేల జరిమానా విధించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

స్వచ్ఛతపై విద్యార్థుల వినూత్న ప్రదర్శన

మెట్‌పల్లి పట్టణం: పట్టణానికి చెందిన బ్లూక్లీన్ పాఠశాల విద్యార్థులు(ఎస్‌హెచ్‌ఎస్) స్వచ్ఛతాహీ సేవాపై గురువారం వినూత్నంగా ప్రదర్శన ఇచ్చారు. బల్దియా అధికారులు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, విష్ణు, ముజీబ్, నిజాం, నర్సయ్య, అశోక్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో ఉచిత భోజన వసతి

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణంలోని జిల్లా గ్రంథాలయ సంస్థను శాసనసభ్యుడు ఎం.సంజయ్‌కుమార్ గురువారం సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పాఠకులు భోజనం కోసం ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అప్పటికప్పుడు భోజన వసతి కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, అదనంగా అధ్యయన గది కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాయికల్‌లో గ్రంథాలయ ఏర్పాటు కోసం కృషి చేస్తామని చెప్పారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

ధర్మపురి, న్యూస్‌టుడే: గోదావరిలో ప్రమాదవశాత్తు జారిపడి భూలక్ష్మి(67) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు ధర్మపురి ఎస్సై మహేష్ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన భూలక్ష్మీ తరచూ ధర్మపురిలోని గోదావరిలో స్నానానికి వెళుతుండేవారు. ఎప్పటిలాగే గురువారం వెళ్లిన భూ లక్ష్మీ.. ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..

జగిత్యాల: స్థానిక మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్(35) 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ

మేడిపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో అండర్ 17 ఖోఖో పోటీల్లో మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రావు, పీఈటీలు నిరంజన్ కుమార్, సురేష్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శ్రీధర్ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు